# పోస్టాఫీస్


చాలాకాలంగా ఉత్తరం రాయాలనుకుంటున్నాను. కాని కుదరడంలేదు. ఏదో ఒక అవాంతరం వచ్చిపడుతోంది. ఒకనాడు కవర్లు కొందామని బయలుదేరాను. పోస్టాఫీసుకి వెళ్ళి చాలా సంవత్సరాలైంది. అంచేత దారి మర్చిపోయాను.

తోవ తెలీదే అని అనిపించగానే ఏం చెయ్యడానికీ తోచక రోడ్డు మధ్యలోనే అలా నిలబడిపోయాను. ఎటు వెళ్ళాలని ఆలోచిస్తున్నాను. ఇంతలో ఎవరో అట్నుంచి వస్తుండడం కనిపించింది. హమ్మయ్య అతన్నడిగి పోస్టాఫీసుకి దారి కనుక్కుందామని దగ్గరికి వెళ్ళాను. వెళ్ళి పోస్టాఫీసు ఎటువైపని అడిగాను. అతనేం సమాధానం ఇవ్వలేదు. పైగా గట్టిగా నవ్వడం మొదలుపెట్టాడు. దాంతో నాకనుమానం వచ్చింది కొంపతీసి పిచ్చివాడు కాదుకదా అని. లేకపోతే ఎటువెళ్ళాలో తేల్చుకోలేక ఇందాకా రోడ్డు మధ్యనే ఆగిపోయానుకదా దూరంనుంచినా అవస్థచూసి నన్నే పిచ్చివాడికింద జమవేసేడా? ఏదిఏమైనా వీడి దగ్గర ఎక్కువసేపు నిలబడ్డం క్షేమంకాదు. వీడి చేతిలో ఓ పెద్ద దుడ్డుకర్రుండి, నిజంగా నేననుకున్నట్టు పిచ్చివాడే అయి, ఆ కర్రతో నన్నో పెట్టు పెడితే? భయంవేసింది. గబగబా అక్కడ్నుంచి తప్పుకున్నాను. కొంచెం దూరంపోయి వెనక్కి తిరిగిచూశాను. ఆ వ్యక్తి కర్ర ఊతంగా పట్టుకొని తడుముకుంటూ వెళ్ళిపోతున్నాడు. ఆహా! అయితే వాడు గుడ్డివాడన్నమాట! అందుకే తోవడిగితే నవ్వేడు! అయినా, తోవకనిపించకపోయినా బాగానే వెళ్ళగలుగుతున్నాడు!

మళ్ళీ నడుస్తున్నాను. ఇంతలో మరో మనిషి కనిపించాడు. అతడ్ని ఆపి పోస్టాఫీసెక్కడని అడిగాను. పోస్టాఫీసంటే ఏమిటని ఎదురు ప్రశ్న వేశాడు. అసలైన పిచ్చివాడు వీడు అనిపించింది. వీడ్నుంచి తప్పించుకోవాలని గబగబా అడుగులు వెయ్యబోయాను. కాని నన్ను వెళ్ళనివ్వకుండా ఆపి, నా చెయ్యి పట్టుకొని తనవైపుగా ఓ గుంజు గుంజాడు. నేనతనిమీద తూలిపడ్డాను. ''చెప్పు పోస్టాఫీసంటే ఏమిటి?'' అని క్రూరంగా అడిగాడు. చెప్పకపోతే చంపేస్తాడో ఏమిటో! అంచేత జవాబుచెప్పాలని నోరు తెరిచాను. కాని నాకే తెలీలేదు ఏం చెప్పాలో.

ఇంకా ఎక్కువ ఆలస్యం చేస్తే చెయ్యి విరిచేస్తాడేమోనని భయంవేసి ''పోస్టాఫీసంటే — మనం ఈ ఉత్తరాలు అవీ వేస్తుంటాం చూడండి — అది'' అన్నాను.

''ఉత్తరాలా? ఉత్తరాలంటే ఏమిటి?'' అని



గట్టిగా ఉరిమేడు. దాంతో వణికిపోతూ ''మనవాళ్లకి రాసుకుంటుంటాం — అవీ'' అన్నాను.

''మనవాళ్లా? ప్రపంచంలో మనవాళ్లని వున్నారా? అందరూ పైవాళ్లేకదా? నా మట్టుకు నేను పుట్టిం దగ్గర్నుండీ ఒక్కణ్ణే. ఎవర్నిచూసినా ఎవరూ లేనివాళ్లలాగనే కనిపిస్తున్నారు. అలాంటప్పుడు ఉత్తరాలేమిటి? రాయటమేమిటి? ఇంతకాలానికి ఉత్తరాలు రాయాలనుకుంటున్నవాడివి ఒకడివి తారసపడ్డావు. అంచేత నీకు కావలసి వాళ్ళు ఎవరో వున్నారన్నమాట. చెప్పు ఎవరు వాళ్ళు? వాళ్ళనికెలాటి ఆప్తులు?''


సమాధానం చెప్పటానికి తటపటాయించాను. అవునూ, వాడండిగిందానికి సమాధానం చెప్పడానికి కావలసిన భోగట్టా నాకు గుర్తురవాడం లేదేమిటి చెమ్మా? నేను నిశ్శబ్దంగా వూరుకోవడం చూసి, గొల్లున దెయ్యంలా నవ్వి ''చూశావా — నీకూ ఎవరూ లేరన్నమాట!'' అనేసి, నా చెయ్యి వదిలేసి వెళ్ళిపోయాడు.

బతుకుజీవుడా అని నడక సాగించాను గబగబా. రోడ్లన్నీ నిశ్శబ్దంగా దివ్వుదివ్వుమంటున్నాయి. ఎక్కడా మనిషి జాడలేదు. చీకటిపడుతోంది. త్వరగా పోస్టాఫీస్ చేరుకుంటే బావుండ్ను! మరికొంచెం దూరం నడిచినప్పటికి ఒక జంక్షన్ చేరుకున్నాను. లెక్కపెట్టడానికి వీల్లేనన్ని రోడ్లు అన్ని పక్కలకీ వెళుతున్నాయి ఆ జంక్షన్ దగ్గిర్నుండి. అన్నిరోడ్లు చూడగానే గొప్ప భయం వేసింది. ఎటు వెళ్లడానికి, ఏం చెయ్యడానికీ పాలుపోలేదు. చీకట్లో నిలబడ్లేక దొరికి రోడ్డు పట్టుకొని గబగబ నడక సాగించాను. అబ్బా! ఎటుచచ్చిందో ఈ పోస్టాఫీస్! ఓ అరగంట నడిచి ఉంటానేమో! ఇంతలో రోడ్డుకి కాస్త దూరంలో ఓ పెద్ద భవంతి కనిపించిం

ది. చీకట్లో అది భూతగృహంలా కనిపిస్తోంది. దానిముందు ఎఱ్ఱరంగులో ఓ పెద్ద బోర్డు కనబడుతోంది. దానిమీద అక్షరాలు.

దూరంగావు

న్న ఓ వీధిదీపం కాంతి మినుకుమినుకుమంటూ ఈ ఎఱ్ఱబోర్డు మీద పడుతోంది. ఆ వెలుతుర్లో బోర్డు మండుతున్నట్టుగా అనిపించింది. గుండెలు గడగడ కొట్టుకుంటున్నాయి. అయినా ధైర్యంచేసి, మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ దగ్గరికెళ్లి బోర్డుమీది అక్షరాలు చదివాను. ''పోస్టాఫీస్'' హమ్మయ్య, చేరుకు



న్నాను ఎలాగైతేనేం! సంతోషంతో లోపలికి పరిగెత్తినంత పనిచేశాను. అయితే చీకట్లో నేను చూసుకోలేదుగాని, గేటు దగ్గర తుపాకీ పట్టుకొని క్రూరంగా కనిపిస్తున్న పోలీసొకడు నిలబడి వున్నాడు. లోపలికి పరిగెత్తబోతున్న నన్ను ఆపి, ''ఏం కావాలి?'' అని గర్జించాడు.

''పోస్టు కవరు కావాలి'' అన్నాను నసుగుతూ.

''ఇది పోస్టాఫీసుకాదు'' అన్నాడు కఠినంగా పోలీసు.


''మరి బోర్డుంది?''

''అవును ఆ మాట నిజమే! ఆ బోర్డు నిన్ను అనవసరం భ్రమపెట్టింది. కాని నిన్ననే పోస్టాఫీసు ఇక్కడ్నుంచి తీసేసి, దీన్లో జైలు పెట్టారు— తెలిసిందా, ఇక వెళ్లు'' అని గసిరాడు. నేను సందేహిస్తుండడం చూసి ''కాదు కాసేపు జైల్లో కూర్చుంటానంటావా చెప్పు — లోపలికి పంపిస్తాను'' అని గొల్లున నవ్వాడు — రాక్షసుడు నవ్వినట్టు.

పీడితో మనకేమిటని, వెనక్కి తిరిగి నాలుగడుగులు వేశాను. ఇంతలో పోలీసు వెనకనుండి పెద్దకేకవేశాడు. ''ఒరే పిచ్చి నాయాలా! ఈ బిల్డింగ్ లోపలే జైలుందనుకుంటున్నావేట్రా? నువ్వసలుంటున్నదేటో కసింత అర్థం సేస్కోరా!'' అని. గజగజ వొణికిపోయాను భయంతో. ఏమిటివాళంతా పిచ్చివాళ్లే తారసపడుతున్నారు. పరిగెత్తాను. కొంచెం దూరం పరిగెత్తినప్పటికి పార్కు కనపడింది. పార్కు నిండా దీపాలే! కాని ఒక్క మనిషి కూడా కనపడ్డంలేదు ఎక్కడా. పరిగెత్తడంతోనీ, భయంతోనీ చెమట్లు పట్టేసి, ఓ బెంచీమీద కూలబడ్డాను. చెమటలుతుడుచుకోవాలని రుమాలుకోసం జేబులో చెయ్యిపెట్టాను. ఏదో చేతికి తగిలింది. తీసి చూద్దుకదా — ఉత్తరం. అవునుకదూ ఈ ఉత్తరానికే జవాబు రాయాలని నా తాపత్రయం. అయినా ఉత్తరం వొచ్చి చాలా సంవత్సరాలైపోయింది కదా, అందులో ఏం రాసుందో మర్చిపోయాను. సరే, ఈ ఉత్తరం ఇవాళ తీరిగ్గా చదివి రేపు దానికి వివరంగా జవాబు రాస్తానుకొని ఉత్తరం విప్పాను. నాకు మతిపోయింది. చెమటక్కాబోలు అక్షరాలన్నీ చెదిరిపోయి, అలుక్కుపోయాయి. అందులో ఏమిటి రాసుందో తెలీడంలేదు. ఎక్కడ్నుంచి వచ్చిందో కూడా తెలీలేదు. పోనీ సంతకమేనా తెలిస్తే, ఎవరిదగ్గర్నుండి వచ్చిందో ఊహించి జవాబు రాయొచ్చు. సంతకం చూడ్డానికి ఉత్తరం అడుగుభాగానికి దృష్టి మళ్ళించాను. అబ్బే! సంతకం కూడా చెదిరిపోయింది. మసగమసగ్గా 'అసంగతం' అని కనిపిస్తోంది. ఎవరు చెప్మా ఈ అసంగతం? గుర్తురావడంలేదు. ఏం చెయ్యడానికీ తోచలేదు. ఇంతలో కరెంటు పోయినట్లుంది — పార్కులో లైట్లన్నీ ఒక్కమారుగా ఆరిపోయాయి. భయపడిపోతూ, చీకట్లో ఒక్కణ్ణీ అలా కూర్చున్నాను. ●

ఎ.వి.రెడ్డిశాస్త్రి

## పాటల రాయబారి



కిరణాల ద్వారా ప్రసారమౌతున్న
సూర్యుని ఉదయగానం వింటాడు
ఉదయం గడ్డిపై మెరుస్తున్న
మంచుబిందువులతో మాట్లాడతాడు
కవిపై వెయ్యి సూర్యులు ప్రవహిస్తారు
పగలు రాత్రుల అలలు కదలిపోతాయి
అలల అరుపులు తీరం అరుపులు
ఆకాశంలో పక్షుల అరుపులు వింటాడు
వాటి బాధను తాను
అనుభవిస్తాడు అనువదిస్తాడు
అన్నిటి బాధను అందరి బాధను
తనలో పలికిస్తాడు
నాలుక లేని బాధ మూగబాధ
కవిని నిరంతరం కౌగిలించుకుంటుంది

కవి పాటల రాయబారి
తాను పాటలో చెబుతున్నదంతా
బాధలో నేర్చుకుంటాడు
దినం నడిచిపోతున్న చప్పుడు కూడా
కవి వింటాడు

— ఎ. సూర్యప్రకాష్ ●